మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/ నారాయణపేట

# 139 గ్రామ పంచాయతీలు
## 1188 వార్డులు

- మొదటి విడుత ఎన్నికలకు సిద్ధం
- పీవో, ఏపీవోలకు ర్యాండమైజేషన్ పూర్తి
- ఎన్నికల విధుల్లో 3097 మంది సిబ్బంది
- ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయిని దేవి,

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి


సూచనలు చేస్తున్న ఎన్నికల పరిశీలకురాలు, కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్4,ప్రభాతవార్త:** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి, ఐ. ఏ.ఎస్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగాసాధారణ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ టి పోల్ పోర్టల్ ద్వారా మొదటి విడత ఎన్నికల విధులు నిర్వహించే పిఓ, ఏపిఓలకు రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో గణపురం, రేగొండ, మొదటి విడత గండీడ్, మహమ్మదా బాద్, నవాబ్ పేట, రాజాపూర్, మహబూబ్ నగర్ మండలాలలోని 139 గ్రామ పంచాయతీలు, 1188 వార్డులకు పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలకు ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల సంగం నియమావళిని పరిగణనలోకి తీసుకొని పారదర్శకంగా ర్యాండమైజేషన్ చేపట్టామని పరిశీలకులు వివరించారు. పిఓలు 1426 మంది, ఓపిఓలు 1671 మంది కలిపి మొత్తం 3097 మంది సిబ్బందిని 20 శాతం రిజర్వ్ తో కలిపి రాండమైజేషన్ ద్వారా పోలింగ్ విధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,ఆర్.డి. ఓ నవీన్,ట్రైనీ డి.పి. ఓ నిఖిలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# మైక్రో ఆబ్జర్వర్ల పాత్ర కీలకం

- ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి


మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 4 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిస్పక్షపాతంగా నిర్వహించ డంలో సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్లు) పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర సాధారణ పరిశీ లకురాలు కాత్యాయనిదేవి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్ర మంలో మైక్రో ఆబ్జర్వర్లను ఉద్దేశించి మాట్లా డుతూ సర్పంచ్, వార్డు ఎన్నికల ప్రక్రియను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే కొన్నిచోట్ల క్రిటికల్ (సమ స్యాత్మకమైన) పోలింగ్ కేంద్రాలను గుర్తించిన నేపథ్యంలో, అటువంటి కేంద్రాల్లో ప్రత్యేకం గా మైక్రో ఆబ్జర్వర్లను నియమించనున్నట్లు తెలిపారు. వారి ప్రధాన బాధ్యత సర్పంచ్ గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించడం, కొన్ని సందర్భాల్లో ఎక్కడైనా అవసరమైతే ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశం చేసి ఎన్నికలు సజావుగా సాగే లా చూడాలి అని అన్నారు. శిక్షణలో మైక్రో ఆబ్జర్వర్లు ఎన్నికల నియమాలు, మార్గ దర్శకాలు ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా అను సరించి వాటిని నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఘట నలనురికార్డ్ చేసి,తమపై అధికారులకు, ఎమ్మికల పరిశీలకులకు తుది నివేదిక సమ ర్పించడం తప్పనిసరిగా చేయాలని వారికి తెలియ చేశారు. వారి నివేదికల్లో ఏవైనా ఎన్నికల నియమావళికి విరుద్ధంగా లోపాలు జరిగినట్టు గుర్తించబడితే, ఆ సంబంధిత పోలింగ్ స్టేషన్లలో రీపోలింగ్ నిర్వహించే అవ కాశం ఉందని అన్నారు. అందుకే ప్రతి మైక్రో ఆబ్జర్వర్ అత్యంత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తున్నప్పటికి, పోలింగ్ కేంద్రాల్లో తక్షణ నిర్ణయాలు తీసుకోవడంలో మైక్రో ఆబ్జర్వర్ల పాత్ర అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో జరుగు తున్న ఎన్నికలు పారదర్శకంగా, శాంతి యుతంగా జరగేందుకు మైక్రో ఆబ్జర్వర్లు ముఖ్య భూమిక పోషిస్తారని ఆమె అభిప్రాయ పడ్డారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సిఈఓ వెంకట రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు బాలు యాదవ్ సాయిబాబా, మైక్రో అబ్జర్వర్ నోడల్ అధికారి ,ఎల్‌డిఎం చంద్ర శేఖర్ పాల్గొన్నారు.


హాజరైన పిఓలు, ఏపిఓలు, ఎన్నికల సిబ్బంది

# ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజనపై ప్రత్యేక దృష్టి

- జిల్లా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా సూచనలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్4, ప్రభాతవార్త:** న్యూ ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలుపై కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వ హించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వ్యవసాయ అను బంధ రంగాల అధికారులతో కలిసి హాజరయ్యారు. ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలు వేగవంతం చేయడానికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు గురువారం దేశవ్యాప్తంగా 6 రాష్ట్రాల జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ నోడల్ అధి కారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి భారత వ్యవసాయమంత్రిత్వశాఖ ప్రత్యేకకార్యదర్శి, జాయింట్ సెక్రటరీలు, పథకం డైరెక్టర్లు పాల్గొని, పథకం పురోగతి, జిల్లాల వారీగా చేపట్టాల్సిన చర్యలు, రైతులకు అందిం చాల్సినసౌకర్యాలపై కలెక్టర్లతో విస్తృత సమీక్ష చేప ట్టారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలు వేగ వంతం చేయడానికి అవసరమైన అన్ని విభాగాల నుండిసమగ్ర సమాచారం, ప్రస్తుత పురోగతి వివరాలు, ఇంకా ముందుకు తీసుకోవాల్సిన చర్యలను కలిగి ఉన్న పక్కా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై, ముఖ్యంగా వ్యవసాయానికి అనుబంధ శాఖల వారీగా అవి ఎలా అమలు అవుతున్నాయో సంబం ధించిన వివరణాత్మక –మిగతా4లో..

# ఎన్నికల సామాగ్రి పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్


ఎన్నికల సామాగ్రిని పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట, డిసెంబరు 4 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలివిడత పోలింగ్‌కు సంబంధించిన సామాగ్రి పంపిణీ ప్రక్రియను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రత్యక్షంగా పర్య వేక్షించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీ దత్త బృందావన్ బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కోస్గి,కొత్తపల్లి,గుండుమల్,మద్దూర్ మండలాల్లో జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సు లు, ఇతర ఉపకరణాలు సక్రమంగా సిద్ధంగా ఉన్నాయా అని కలెక్టర్ అధికారులు నుండి వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం ముద్రించిన బ్యాలెట్ పేపర్లను పరిశీలించి, వాటి నాణ్యత, సంఖ్యను ధృవీకరించారు. రెండో,మూడో విడతలకు అవసరమైన బ్యాలెట్ బాక్సుల తయారీ,లభ్యతపై కూడా ఆమె సమగ్రంగా సమీక్షించారు. అవసరమైన స్థాయిలో సామాగ్రి నిల్వలను సిద్ధంగా ఉంచాలని, లోటు ఉన్నచోట వెంటనే తెప్పించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డీపీఓ సుధాకర్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారిఅబ్దుల్ ఖలీల్, మద్దూరు, గుండుమల్ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల వివరాలు సరిచూసుకొని

# నామినేషన్లు స్వీకరించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్


పత్రాలను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్

**గద్వాల టౌన్ డిసెంబర్ 4, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఆయా పంచాయతీలకు ఖరారు చేసిన రిజర్వేషన్లను సరిచూసుకొని పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామి నేషన్లను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ బెటాలియన్ లో ఉన్న జెడ్పిహెచ్ఎస్ భవనంలో క్లస్టర్1, క్లస్టర్2 నామినేషన్లను స్వీక రించు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఇక్కడ ఎర్రవల్లి తో పాటు సాసనోలు, ఆర్. గార్లపాడు తిమ్మాపూర్, షేక్ పల్లె, బీచు పల్లి, జింకలపల్లి, కొండేరు, బి.వీరాపూర్ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను కూడా స్వీకరిస్తుండడంతో ఆయా పంచాయతీల ఓటర్ లిస్టును పరిశీలించారు. పోటీ చేయు అభ్య ర్థులు పూరించాల్సిన వివిధ దరఖాస్తులను, నామినేషన్ వేసేందుకు అవసరమైన ఇతర సామాగ్రిని రిటర్నింగ్ అధికారులు సిద్ధంగా ఉంచుకోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే వారికి తగిన సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బం దికిసూచించారు. సర్పంచు,వార్డు సభ్యులు పదవులకు పోటీ చేయు అభ్యర్థులు తమ దరఖాస్తుకు జతపరచాల్సిన వయసు,కుల, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాల నీ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పోటీ చేయు అభ్యర్థులు గ్రామ పంచాయితీకి చెల్లించాల్సిన పన్నులు పెండింగ్లో ఉండకుండా కట్టించుకోవాలన్నారు. నామినేషన్ల డిపాజిట్ స్వీకరించాక అభ్యర్థు లకు రసీదును అందజేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పత్రాలను విధిగా నామినేషన్ వేసిన వారికి అందజేయాలన్నారు. నామినేషన్ వేసిన వారి వివరాలను ఎప్పటి కప్పుడు టీపోల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటలలోగా నామినేషన్ కేంద్రంలోపల ఉన్న వారి నుంచి మాత్రమే నామిన ేషన్లు స్వీకరించాలని, నిర్దేశిత సమయం మించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో కేంద్రంలోకి అనుమతించరాదన్నారు. ఈ పర్యటనలో ఎర్రవల్లి మండల తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్, తదితరులున్నారు.

# విద్యే ప్రధాన శక్తి

- అత్యున్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్4,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులు అత్యున్నత విద్యా అవకాశాలను అందుకొని భవిష్యత్‌లో ప్రతిష్టాత్మక స్థానాలను సంపాదించాలని ఆకాంక్షిస్తూ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన స్వంత నిధులతో నిష్ణాతులైన అధ్యాపకుల బృందం చేత క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను తయారు చేయించి, నగరంలోని మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత రెండు సంవత్సరాలుగా ఉచితంగా అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం ప్రభుత్వ న్యూ టౌన్ ఉన్నత పాఠశాల, బేసిక్ ప్రాక్టీస్ ఉన్నత పాఠశాల, మాడ్రన్ హైస్కూల్‌లలో విద్యార్థులకు ఈ క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ వంటి అభివృద్ధి చెందుతున్న నగరాలకు విద్యే ప్రధాన శక్తి అని ఆయన అన్నారు. –మిగతా4లో..

# రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు డబ్బు జమ చేయాలి

- ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రానీయొద్దు
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్
- మూసాపేట, అడ్డాకుల మండలాల్లో ఆకస్మిక తనిఖీ


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్, అడ్డాకుల,మూసాపేట, డిసెంబర్4,ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియను మూడవ విడతజరిగే అడ్డాకుల్ మండల కేంద్రంలో రెండు నామి నేషన్ సేకరించు కేంద్రాలను అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తనిఖీ చేశారు. అలాగే శాఖాపూర్ గ్రామపంచాయతీ అడాకుల మండ లం నామినేషన్ ప్రక్రియను తాసిల్దారు, ఎంపీడీవోతో కలిసి తనిఖీ చేశారు. అలాగే మూసాపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. అక్కడ జరుగు తున్న నామినేషన్ ప్రక్రియను సిబ్బందిని అడిగి తెలుసుకొని, వారి సందేహాలను నివృత్తి చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థులు వారితో పాటువచ్చేవారు ఎక్కువ సంఖ్యలోరాకుండా చూసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే వారి సందేహా లను పరిశీలిం చి వారికి సూచనలు ఇవ్వవలసిందిగా ఎన్నికల సిబ్బందికి ఆదేశం చారు. అలాగే శాఖాపూర్ గ్రామము అడ్డాకుల మండలం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని,కోయిలకొండ మండలకేంద్రంలో ఉన్నటువంటి వారిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీ లించారు. రెండు కేంద్రాల్లో ధాన్యం ధాన్యపు బస్తాలని తూకంపేట తూర్పారబట్టుట పరిశీలిం చారు. అక్కడ ఉన్న సిబ్బందికి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలో చేయాలనివారిఅకౌంట్ వివరాలు సేకరించి ఎప్పటికప్పుడు వారిఅకౌంట్లో డబ్బులు తొంద రగా పడేవిధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

# అంగన్వాడీలు చిన్నారుల భవిష్యత్‌కు పునాది

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్4,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ నాయకులు కోస్గి శివప్రసాద్‌రెడ్డి తనస్వంత నిధులతో సమకూర్చిన ఏకరూప దుస్తులను మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని దివిటిపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారు లకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. చిన్నా రులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి ఆరోగ్యం, పోషణ, విద్యా అభివృద్ధి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేమాట్లాడుతూ "అంగన్వాడీలు చిన్నారుల భవిష్యత్ నిర్మాణానికి పునాది అని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలు ప్రతి బిడ్డకు సమానంగా చేరేందుకు కట్టుబడి ఉన్నాము. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యలో ఎలాంటి రాజీపడము" అని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా అంగన్వాడీల్లో చిన్నారులకు ప్రొజెక్టర్ ద్వారా కదిలే బొమ్మలతో (యానిమేషన్) పాఠాలు బోధించే విధానం అమలు చేయడానికి చర్యలు ప్రారంభించామని అందులో భాగంగా నగరంలోని పలుఅంగన్వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్లు వెల్లడిం చారు. త్వరలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ డిజిటల్ తరగతులనుఅందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. అంగన్వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు అందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కోస్గి శివప్రసాద్ రెడ్డి ని ఎమ్మె ల్యే ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెలశ్రీనివాసులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు జేసీఆర్, చర్ల శ్రీనివాసులు అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

# వైభవంగా పడమటి ఆంజనేయ స్వామి రథోత్సవం


మక్తల్ పడమటి ఆంజనేయస్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

**మక్తల్ టౌన్, డిసెంబరు4 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో శ్రీ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు స్వామివారి ప్రభోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రధా నమైన పాలప్రభోత్సవ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పోలీసులు, వివిధ ధార్మిక సంస్థల సభ్యులు నిర్వహణ, నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. కోరిన కోరికలను తీర్చే స్వామిగా పేరుగాంచిన పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పి. ప్రాణేశాచార్య, రాఘవేంద్రాచార్య స్వామివారికి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. తరువాత స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్టించి పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న గోధా ఆంజనేయ స్వామి దేవాలయం వరకు భజన బృందాల మధుర నినాదాల మధ్య పల్లకి యాత్ర జరిగింది. తిరిగి పల్లకి సేవ ఆలయానికి చేరుకున్నాక స్వామివారిఉత్సవ మూర్తిని ప్రభోత్సవంపై ప్రతిష్టించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేడుకలకు తరలివచ్చిన భక్తులు, ప్రముఖులు ప్రభోత్సవానికి హారతులు పట్టి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగిపోయింది. –మిగతా4లో..

# రోడ్లపై ఆరాబోసిన వరి ధాన్యం

- ఇబ్బందులుపడుతున్న వాహన చోదకులు


తిరుమలాపూర్ స్టేజి సమీపంలో వరి ధాన్యం ఆరబోయడంతో దారి లేక ప్రమాదం జరిగే విధంగా ఎదురెదురుగా వెళ్తున్న వాహనాలు

**ఉప్పునుంతల, డిసెంబరు4 ప్రభాతవార్త:** మండలంలోని తిరుమలా పుర్ స్టేజి నుంచి డిండి చింతపల్లి బ్రిడ్జి వరకు రైతులు రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబోయడంతో మార్గం గుండా వెళ్తున్న వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. రోడ్డుపై సగం వరకు వరి ధాన్యాన్ని ఆరబోయడంతో ఉన్న ఇరుకు రోడ్డుపై వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇలా ఉంటే తాము ఈ మార్గం గుండా వాహనాల నడపలేమని ఆర్టిసి వారు వాపోతున్నారు. గురువారం ఉదయం కంసానిపల్లి నుంచి పోల్కం పల్లి కి వెళ్లడానికి పత్తి లోడుతో వస్తున్న డీసీఎం, ఓ ప్రైవేటు పాఠశాల వాహనాన్ని ఎదురు ఎదురుగా వచ్చి ఢీకొనే ప్రమాదం జరిగింది త్రుటిలో తప్పింది. వాహనాచోదకులు –మిగతా4లో..

## పాఠశాలకు విరాళం అందజేత

**నవాబ్‌పేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎమ్మనగండ్ల ప్రాథమిక పాఠశాలకు ఒక లక్ష యాభై వేల రూపాయలు విరాళంగా శ్రీ రామానంద చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎమ్మనగండ్ల రమేష్ చారి పాఠశాల అభివృద్ధి కొరకు విరాళంగా అక్షరాల 1,50,000 బహుకరించడం జరిగింది. ఈ నిధులతో పాటు విద్యార్థులకు మినరల్ వాటర్ సంబంధించి వాటర్ ప్యూరిఫైయర్ మిషనరీని విరాళంగా ఇవ్వడానికి ఒప్పుకోవడం జరిగింది. పాఠశాల అభివృద్ధి కొరకు తమ యొక్క ట్రస్ట్ నుండి ఎలాంటి సహకారమైనా అందించడం జరుగుతుందని హామీఇవ్వడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతస్థాయిలో ఎదిగి వారు కూడా వివిధ ప్రాంతాల్లో సమాజ సేవ చేయడానికి పూనుకోవాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. ఇటి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు శివదర్శన్‌గౌడ్, యాదయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది. మండల విద్యాధికారి నవాబ్‌పేట్ సమక్షంలో రూ.1,50,000 అందించడం జరిగింది.


పాఠశాలకు విరాళం అందజేస్తున్న రామానంద్ ట్రస్టు సభ్యులు

## శ్రీపడమటి అంజన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామన్న

**మక్తల్ టౌన్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** పడమటి అంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా గురువారం ఉదయం శ్రీ పడమటి ఆంజనేయస్వామి వారిని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి దర్శించడం జరిగినది. ఈ సందర్భంగా దేవాలయ ఈవో కవిత, ఆలయ ధర్మకర్త ప్రాణేష్ ఆచారి పూజారులు రాఘవేంద్ర చారి, అరవింద చారి, మాజీ ఈవో రాఘవేందర్ వారిని ఘనంగా సన్మానించి ఆలయం లోపలికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వారిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిన్న హనుమంతు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జుట్ల శంకర్, నరసింహారెడ్డి, శివారెడ్డి ,ఈశ్వర్ యాదవ్, సాగర్, వన్నెకారి రాజు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

## ప్రజాస్వామ్య ప్రక్రియ ప్రతిష్టాత్మంగా నిర్వహించాలి

**ఉప్పునుంతల, డిసెంబరు 4 ప్రభాతవార్త :** ఎన్నికల నిర్వహణలో సంబంధిత విభాగాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారిణి మాధవి సూచించారు. గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతల నామినేషన్ కేంద్రాన్ని ఆర్‌డిఓ మాధవి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ, పత్రాల పరిశీలన, నామినేషన్ రిజిస్టర్లు, వీడియో రికార్డింగ్, భద్రతా చర్యలు అమలు వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. అనంతరం ఆర్డిఓ మాధవి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న లోపం జరగకుండా సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రజాస్వామ్య ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మక నిర్వహించాలని సూచించారు. ఆర్‌డిఓ మాధవితో పాటు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ, తహసీల్దార్ అద్దంకి సునీత , నామినేషన్ రిటర్నింగ్ అధికారి వెంకటయ్య, సిబ్బంది లక్ష్మణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

## బాలకేంద్రంలో ఘంటసాల జయంతి వేడుకలు

**నారాయణపేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలోని బాలకేంద్రంలో ఘంటసాల 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు సంగ నర్సింహులు, బాలాజీ గౌడ్ మాట్లాడుతూ ఘంటసాల నాదబ్రహ్మ స్వరాలు నేటి గాయకులకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన గానామృత వాఖ్యలు ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యేలా ఉండటంతో తెలుగు సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమం ప్రారంభంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, ఘంటసాల గీతాలను ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లు, మిఠాయిలను పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘంటసాల సంగీత వారసత్వం తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో వసంత్ కుమార్, జ్ఞానామృత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం భక్తి-సంగీత రసాలతో సందడి చేస్తోంది.


ఘంటసాల జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా అంజన్న స్వామి బ్రహ్మోత్సవాలు

**నారాయణ పేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా బిజ్వార్ గ్రామంలో ఘనంగా అంజన్న స్వామి బ్రహ్మోత్సవాలు వ్యాసరాయల మహర్షిచే ప్రతిష్టించబడిన శ్రీ పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో మూడో రోజు బ్రహ్మోత్సవాలు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించారు. ఆలయ పూజారులు నరసింహచారి జోషి, రవికుమార్ జోషి, నాగరాజ్ చారి జోషి, వేణుగోపాల చారి జోషిలు అభిషేకం, పుష్పాలంకరణ, తమలపాకుల సేవను భక్తి శ్రద్ధలతో చేశారు. స్వామివారికి ప్రత్యేక వస్త్రాలు అలంకరించి, నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి భజన మండలి నిర్వహించిన అడుగుల భజన, చెక్కభజన కార్యక్రమాలు ఆలయ ప్రాంగణాన్ని ఆంజన్న నామస్మరణతో మారు మోగించాయి. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిరసాన్ని ఆస్వాదించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గ్రామ భక్తులు బురుజు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మహేష్ గౌడ్, దొరోల్ల కృష్ణయ్య, గుడిసె రాజప్ప, రామచంద్రయ్య గౌడ్, బి.సుధాకర్ రెడ్డి, కుక్కలి వెంకటప్ప, పోలీసు హన్మిరెడ్డి, నిమ్మకాయల హనుమంతు, అశోక్ రెడ్డి పాల్గొన్నారు. భక్తుల ఔత్సాహ్యం, సేవా కార్యక్రమాల వల్ల బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా కొనసాగుతున్నాయి.


అంజన్న స్వామిని అలంకరించిన దృశ్యం

## కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెప్పాల్సిందే

### కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్

**నారాయణ పేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** హిందువుల గురించి, హిందూ దేవతల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని ఆయన విమర్శించారు. మక్తల్ ఆలయ దర్శనం చేసిన వెంటనే బహిరంగ సభలో విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని రఘువీర్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ముస్లిం ఓటు బ్యాంకును ఆకర్షించే ఉద్దేశంతో హిందువులను బాధించే వ్యాఖ్యలు చేస్తోందని ఆయన ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక విజయంతో వచ్చిన అహంకారం ముఖ్యమంత్రి మాటల్లో కనిపిస్తోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో హిందువులంతా ఏకమై కాంగ్రెస్‌కు మళ్లించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారా హిందూ సమాజం గౌరవాన్ని కాపాడుకోవచ్చని రఘువీర్ యాదవ్ అభిప్రాయపడ్డారు. పల్లెల్లో బీజేపీ అభ్యర్థులను సర్పంచులుగా ఉపసర్పంచులుగా ఎన్నుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం చేస్తున్న మైనార్టీ సంతోషీకరణ రాజకీయాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ లో జరిగిన పొరపాట్లు గ్రామాల్లో పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని చివరగా ఆయన ప్రజలను కోరారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు పంచాయతీ ఎన్నికల్లో ఓటుతో సమాధానం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.


రఘువీర్ యాదవ్

# నిద్రమత్తు వీడని వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

**ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా... సీఎం ఫోటో మార్చరా...?**

**దసరా పండుగ నుంచి బయో కెమిస్ట్రీ పరీక్షలకు తీవ్ర అంతరాయం**

**లక్షల రూపాయల ప్రజాధనంతో వెచ్చించిన జనరేటర్ నిరుపయోగం**

**తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ కరువు**

**సీఎం చిత్రపటంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి**

**బీసీ పొలిటికల్ జెఏసి చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్**

**వనపర్తి, డిసెంబరు 4 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిద్రమత్తు వీడటం లేదని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం వెనక వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ట్ హబ్‌ను జెఏసి నాయకులతో కలిసి సందర్శించారు. టీ హబ్ లో నెలకొన్న సమస్యలపై రాచాల విలేకరులతో మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు టి హబ్ పై పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా నేటికీ ఇంకా కెసిఆర్, హరీష్ రావులతో కూడిన ఫ్లెక్సీనే టీ హబ్ ముందు పెట్టడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అంటే అధికారులకు లెక్క లేదా? లేక వివక్ష చూపుతున్నారా అని ఫైర్ అయ్యారు. టీ హబ్ వ్యవహారం చూస్తుంటే ప్రభుత్వాన్ని ప్రజల్లో బద్నాం చేయాలని టీ హబ్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కుమ్మక్కై చేస్తున్న కుట్రలా అనిపిస్తుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. హబ్‌లో ఎంతో అధునాతన బయో కెమిస్ట్రీ యంత్రం చెడిపోతే నెలలు గడుస్తున్నా కూడా మరమ్మత్తులు చేయించడం లేదని, ఫలితంగా ప్రజలు, రోగులు వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్న కొందరు వైద్యుల వల్ల టీ హబ్ నిర్లక్ష్యానికి గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రూ.17 లక్షల ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన జనరేటర్ కూడా నిరుపయోగంగా మారిందని, ప్రస్తుతం సిటీ స్కానింగ్ ఎక్స్‌రేలు తీయాలంటే ఉన్న జనరేటర్ సామర్థ్యం సరిపోవడం లేదన్నారు. కరెంటు పోతే టీ హబ్‌లో సేవలు నిలిచిపోయే దుస్థితి నెలకొందని, తక్షణమే ఈ హబ్‌లోని బయో కెమిస్ట్రీ యంత్రాన్ని మరమ్మత్తులు చేసి, టీహబ్‌కు అవసరమైన సామర్థ్యం కలిగిన జనరేటర్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చిత్రపటాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టరును కోరారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఉన్న నియోజకవర్గంలోనే ఈ విధంగా వివక్ష చూపడం అధికారుల విధుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, చెలిమిల్ల రామన్ గౌడ్, నాగరాజు, రమేష్ గౌడ్, నరేందర్ సాగర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



టీ హబ్‌ను పరిశీలిస్తున్న రాచాల


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రాచాల

## రోశయ్య సేవలు చిరస్మరణీయం

### వేదిక్ మ్యాథ్స్ పోస్టర్ వర్క్‌బుక్స్ ఆవిష్కరించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణ పేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో నిర్వహించిన రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా సేవలందించిన కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని జిల్లాకలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆర్థిక మంత్రిగా ఎన్నో బడ్జెట్లు ప్రవేశపెట్టడంలో రోశయ్య విశేష ప్రతిభ కనబర్చారని ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాభివృద్ధికి వినూత్న సంస్కరణలను అందించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో స్వచ్ఛత, విలువలు పాటించిన మహానుభావుడిగా రోశయ్య అందరికీ ఆదర్శమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సేవాభావంతో పనిచేయాలని ఆమె సూచించారు. తరువాత కలెక్టర్ చదువుల పండుగ" కార్యక్రమంలో భాగంగా వేదిక్ మాథ్స్ పోస్టర్, వర్క్‌బుక్స్‌ను తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. వేదిక్ మ్యాథ్స్‌ను మరింత ఫలితాల దిశగా అమలు చేయడానికి ఉపాధ్యాయులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 10 ఎంపిక చేసిన జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 4,407 మంది విద్యార్థులకు 90 రోజుల ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని అధికారులు తెలిపారు. వేగవంతమైన గణన, లాజికల్ థింకింగ్, ప్రాథమిక గణిత నైపుణ్యాల పెంపు ఈ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వేదిక్ మ్యాథ్స్ ఆధారంగా రూపకల్పన చేసిన ఈ పాఠ్యాంశం గణితం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడంలో దోహదం చేస్తుందని ఏఎంఓ విద్యాసాగర్ వివరించారు. కోస్గి, మద్దూరు, గుండుమల్, కొత్తపల్లి మండలాల్లో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుందని చెప్పారు. గణితంలో భయం తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో వేదిక్ మాథ్స్ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిపిఆర్ఓ రషీద్, స్మార్ట్ లర్నింగ్ ప్రతినిధులు మురహరి, దోసల నిహారిక పాల్గొన్నారు.


కొణిజేటి రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, తదితరులు

## కొనుగోలు కేంద్రం ప్రారంభించారు

## తుకాలు చేయడం మరిచారు


పెద్దాపుర్ కోనుగోలు కేంద్రంలో తుకాలు కానీ వరి ధాన్యం

**ఉప్పునుంతల, డిసెంబరు4 ప్రభాతవార్త :** గత 15 రోజుల క్రితం మండలంలోని పెద్దాపూర్‌గ్రామంలో ఇందిరాక్రాంతిపథం (ఐకెపి) మహిళా సంఘం వారి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రము వద్దకు తీసుకొచ్చి కుప్పలు పోశారు. తూకాలు జరగడంతో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆచరణ జరగడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే తూకాలు చేయాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

## ఊపందుకున్న నామినేషన్ల పర్వం


నామినేషన్ దాఖలు చేస్తున్న సత్తు భూపాల్ రావు

**ఉప్పునుంతల, డిసెంబరు 4 ప్రభాతవార్త :** మండలంలో మూడో విడతలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ గురువారం సర్పంచ్ పదవికి అభ్యర్థుల నామినేషన్లు ఊపందుకున్నాయి. మండలంలో డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు తన స్వగ్రామైన మర్రిపల్లి గ్రామానికి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ క్లస్టర్ లక్ష్మాపూర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా మండలంలోని మేజర్ గ్రామమైన వెల్టూర్ గ్రామంలో నామినేషన్ల పర్వం ఊపందుకుంది.

## స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం సమన్వయంగా పని చేద్దాం

**సభ,సమావేశాలకు అనుమతులు తప్పనిసరి**

**ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీ పై ప్రత్యేక నిఘా**

**తహసిల్దారు ఎలన్న**

**చిన్నచింతకుంట, డిసెంబరు 4 ప్రభాతవార్త:** స్వేచ్ఛాయుత ఎన్నికలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలని తహసీల్దారు ఎల్లన్న కోరారు. గురువారం మండల తహసిల్దార్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు సమర్ధవంతంగా పనిచేయాలని ఆయన కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిబంధనలను ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఎక్కడ కూడా అల్లర్లు జరగకుండా అన్ని శాఖల అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని ఆయన కోరారు. ఎక్కడైనా గొడవలు జరుగుతే పోలీస్ యాక్ట్ 1861, సెక్షన్ 30, 30ఎ కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. డిసెంబర్1 నుంచి 31 వరకు ఈ యాక్ట్ అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు చేయరాదని, అనుమతులు లేకుండా ర్యాలీలు, అర్ధరాత్రి సమావేశాలు నిర్వహించరాదని ఆయన తెలిపారు. సామాజిక మాధ్యమాలలో మతపరమైన పోస్టులు, తప్పుడు ప్రచారాలు, వ్యక్తిగత విమర్శలు చేయరాదని ఆయన సూచించారు. పోలీస్, ఎక్సైజ్ శాఖ అక్రమ మద్యం, డబ్బు పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. మద్యం సేవించి అల్లలు సృష్టిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. అక్రమంగా మద్యం, డబ్బు పంపిణీ పై ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై 100 కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, ఏఎస్ఐ వెంకటస్వామి, ఆర్ఐలు తిరుపతయ్య, అమీర్, ఎక్సైజ్ కానిస్టేబుల్ బాలస్వామిలు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్ ఎల్లన్న

## సోషల్ మీడియాపై పోలీసుల నిఘా

**వెల్దండ, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు సోషల్ మీడియాలో కించపరిచే విధంగా పోస్టులు పెట్టినట్లయితే అట్టి వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎవరైనా సోషల్ మీడియాలో గాని వాట్సాప్ గ్రూపు లలో గాని ఇతర వ్యక్తులను లేదా పార్టీకి వారిని కించపరిచే విధంగా కానీ రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినట్లయితే అతి వ్యక్తులపై గ్రూప్ అడ్మిన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలి : బిజెపి నేతల డిమాండ్

**ఆత్మకూర్ డిసెంబర్ 4, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్ళపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ విషయంపై ముఖ్యమంత్రి తక్షణమే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బిజెపి భక్తులు నియోజకవర్గం నాయకులు రేచింతల శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాలపురం రాము, ఆత్మకూరు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం రోజు ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా పాలనను గాలికి వదిలేసి హిందూ దేవుళ్ళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈనెల 1వ తేదీన ఆత్మకూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు గావించిన ముఖ్యమంత్రి ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తారని అందుకు స్పష్టమైన ప్రకటన చేస్తారని ఆశించిన ఈ ప్రాంత ప్రజలకు నిరాశే మిగిలిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తీవ్రంగా నష్టపోయిన ఆత్మకూరు పట్టణానికి రెవెన్యూ డివిజన్ సాధన ఏకైక మార్గమని ఈవిషయంపై గతంలో పెద్ద ఎత్తున 100 రోజుల ఆందోళన కార్యక్రమాలు చేసినా నేపథ్యంలో గత శాసనసభ ఎన్నికల సమయంలో మక్తల్ శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆత్మకూర్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటిస్తామని సభాముఖంగా ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించగా ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి కానీ హిందూ దేవుళ్ళపై అనవసరమైన వ్యాఖ్యలు చేస్తే భవిష్యత్తులో తగిన విధంగా బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు మండల సూరి బిజెపి నాయకులు సమ్మర్ బాలకృష్ణ విజయ్ వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## రక్తదాన శిబిరం విజయవంతం



ఎమ్వీరామన్ పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం దృశ్యం

**ఆత్మకూర్ డిసెంబర్ 4,ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి చెందిన ఎం.వి.రామన్ పాఠశాలల అధినేత టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మొగిలి శ్రీధర్ గౌడ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రోజు ఆత్మకూరు పట్టణంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా కొనసాగింది.. రిక్రా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో దాదాపు 15 మందికి పైగా పాల్గొని యువతి యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి అనే నినాదంతో తమ పాఠశాల ఆధ్వర్యంలో అహర్నిశలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లుగా ఆయన తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్నటువంటి రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున యువతీయువకులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ సొసైటీ ఉమ్మడి జిల్లా నాయకులు నటరాజన్ పట్టణానికి చెందిన ప్రముఖులు వివిధ రాజకీయ పార్టీల చెందిన నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి

**నారాయణ పేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఓటింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరగాలని మైక్రో అబ్జర్వర్లు ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె కీలక సూచనలు చేశారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ అనంతరం కేటాయించే పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు సంబంధించిన ప్రతి దశపై పూర్తి అవగాహన కలిగి పనిచేయాలని చెప్పారు. పోలింగ్‌కు ముందురోజు ఉదయం 7 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు హాజరై పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా ఉన్నాయా లేదో పరిశీలించాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు, సీక్రెట్ కంపార్ట్మెంట్ ఏర్పాటు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని సూచించారు. పోలింగ్ సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను గమనించి, ఏవైనా టెండర్ లేదా ఛాలెంజ్ ఓట్లు జరిగితే వాటి వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. అయితే మైక్రో అబ్జర్వర్ల బాధ్యత పరిశీలన వరకే పరిమితం కావాలని, ఎక్కడా పోలింగ్ ప్రక్రియలో జోక్యం చేసుకోరాదు అని ఆమె హెచ్చరించారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా అవసరమని ఓటర్లపై ఎవరి ప్రభావం లేకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల గుర్తింపు కార్డు లేని వ్యక్తులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకురాలు

## లాన్ టెన్నిస్ కోర్టును ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ

**నారాయణ పేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్మించిన కొత్త లాన్ టెన్నిస్ కోర్టును జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డా. వినీత్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని, ఈ కోర్టు పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఎస్పీ డా. వినీత్ మాట్లాడుతూ ఫోర్స్ ఫిట్‌నెస్‌ను పెంచే దిశగా పరేడ్ గ్రౌండ్‌లో



టెన్నిస్ కోర్టును ప్రారంభించిన కలెక్టర్

ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, టీమ్‌వర్క్‌ను పెంపొందిస్తాయని యువత క్రీడల వైపు ఆకర్షితులవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డిఎస్పీలు, సీఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అధికారులు కోర్టును సందర్శించి టెన్నిస్ ఆడుతూ సిబ్బందిని ప్రోత్సహించారు.

## అమరచింత జామియా మజీద్ కమిటీ అధ్యక్షుడిగా, అయూబ్ ఖాన్ ఎన్నిక

**అమరచింత డిసెంబర్ 4, ప్రభాతవార్త:** అమరచింత పట్టణ జామియా మజీద్ కమిటీ నూతన అధ్యక్షులుగా, అయూబ్ ఖాన్ ను ముస్లింలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం అమరచింత పట్టణంలోని జామియా మజీద్ లో ఏర్పాటు చేసిన ముస్లింలు సమావేశంలో జామియా మజీద్ నూతన అధ్యక్షులు, అయుబ్ ఖాన్ మాట్లాడుతూ, ముస్లిం మైనార్టీల సంక్షేమం తోపాటు మజీద్ అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తానని



ఆయన అన్నారు. జామియ మజీద్ కు చేసిన సేవలను గుర్తించి మళ్లీ అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు ముస్లిం మైనార్టీ సోదరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అమరచింత పట్టణ జామియా మజీద్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన అయూబ్ పట్టణ ముస్లిం లు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జామియం మజీద్ కమిటీ పెద్దలు, ఇస్మాయిల్, ఫరీద్, ఏబి నిస్సార్, సోనీ అక్బర్, మైనదిన్, షబ్బీర్, ఫయాజ్, నిస్సార్, ఖాజా హుస్సేన్, రఫీ, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ పడమటి ఆంజనేయ స్వామి

## బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** శ్రీ పడమటి అంజనేయ స్వామి జాతర మహోత్సవ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి తెల్లవారు జామున తలనీలాలు సమర్పించి ఎన్నో దశాబ్దాలుగా పడావుగా ఉన్న కోనేరును శాసనసభ్యులుగా గెలిచిన తర్వాత పునరుద్ధరిస్తానని వాగ్దానం చేసి నేడు కోనేరు అద్భుతంగా తీర్చిదిద్ది అదే కోనేరులో స్నానమాచరించి సకుటుంబ సమేతంగా ఆంజనేయస్వామి వారికి ఉదయం మూడు గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం జరిగింది.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

తదనంతరం ఆలయ ధర్మకర్త ప్రాణేశాచారి మంత్రికి శాలువాతో సత్కరించారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి ఆంజనేయ స్వామి వారికి పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** ఇటీవల నాగర్‌కర్నూలు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గురువారం అచ్చంపేట సబ్ డివిజన్ పరిధిలోని అమ్రాబాద్, పదర, అచ్చంపేట, ఈగలపెంట పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో ఎన్నికల సరళి గురించి నామినేషన్ కేంద్రాలు (క్లస్టర్ల) వద్ద బందోబస్తు గురించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకొని పలు



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి వివరాలు అడుగుతున్న ఎస్పీ

సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అదేవిధంగా రౌడీషీటర్ల వివరాలు తెలుసుకొని వారి కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ తమతమ గ్రామాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. సందర్శన సమయంలో పోలీస్ స్టేషన్ పరిశుభ్రత రికార్డుల నిర్వహణ సిబ్బంది క్రమశిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా ఎస్పీ సిబ్బందిని ప్రశంసించారు. ప్రజల భద్రత శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## రెండో రోజు దాఖలైన నామినేషన్లు

**ఉప్పునుంతల, డిసెంబరు 4 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో 27 గ్రామ పంచాయతీల గాను, 222 వార్డులకు రెండో రోజైనా గురువారం సర్పంచులకు 31, వార్డు సభ్యులకు 79 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి ఎంపిడిఓ వరుణ్ తేజ వివరించారు. ఉప్పునుంతల నామినేషన్ క్లస్టర్ పరిధిలో సర్పంచులకు 05, వార్డు సభ్యులకు 01 నామినేషన్లు దాఖలు కాగా, పిరట్వాన్ పల్లి క్లస్టర్ పరిధిలో సర్పంచులకు 05, వార్డు సభ్యులకు 07, సదగోడు క్లస్టర్ పరిధిలో సర్పంచులకు 08, వార్డు సభ్యులకు 18, వెల్టూర్ క్లస్టర్ లో సర్పంచులకు 03, వార్డు సభ్యులకు 20, గువ్వలోనిపల్లి క్లస్టర్ పరిధిలో సర్పంచులకు 02, వార్డు సభ్యులకు 08, పెనిమిళ్ళ క్లస్టర్ పరిధిలో సర్పంచులకు 03, వార్డు సభ్యులకు14, లక్ష్మాపూర్ క్లస్టర్ పరిధిలో సర్పంచులకు 08, వార్డు సభ్యులకు 25 నామినేషన్లు దాఖలైనట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి,ఎంపిడిఓ వరుణ్ తేజ తెలిపారు. నామినేషన్ కేంద్రాలు ఉప్పునుంతల, పిరట్వాన్ పల్లి, సదగోడు, వెల్టూరు, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ళ, లక్ష్మాపూర్ ఆర్వోలు టి. వెంకటయ్య ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం వెల్టూర్, పిరట్వాన్‌పల్లి ఆర్ఓ కట్ట మల్లారెడ్డి కంసానిపల్లి హైస్కూల్, సదగోడు ఆర్ఓఆర్ డబ్ల్యూఎస్ ఎఇ సాయికృష్ణ, వెల్టూరు ఆర్ఓ మహేష్ పంచాయతీ రాజ్ ఎఇ, గువ్వలోని పల్లి ఆర్వో వెల్టూర్ హై స్కూల్ హెచ్‌ఎం ఆంజనేయులు , పెనిమిళ్ళ ఆర్వో లక్ష్మాపూర్ హెచ్‌ఎం వెంకటయ్య, లక్ష్మాపూర్ ఆర్వో అశోక్ కొరటికల్ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గున్ముక్ల గుట్టపై అంగరంగ వైభవంగా కడపరాయ స్వామి జాతర

**ధన్వాడ,డిసెంబరు 4 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం-గున్ముక్ల గుట్టపై వెలసిన స్వయంభూ శ్రీశ్రీశ్రీ కడపరాయ స్వామి వారి జాతర ఈ సారి అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధల నడుమ విజయవంతంగా నిర్వహించబడింది. కిష్టాపూర్ నుండి ప్రారంభమైన ఉద్దాలఊరేగింపు గున్ముక్ల గుట్టపైకి చేరుకోగా, మార్గమంతా భక్తి ఘోషలతో ప్రాంతం మొత్తం పల్లకీసేవలా మారిపోయింది. జాతరకు స్థానికులు మాత్రమే కాకుండా మహారాష్ట్ర, బొంబాయి, కర్ణాటక, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భారీ ఎత్తున



దాసంగాలు పెడుతున్న భక్తులు

భక్తులు తరలివచ్చారు. స్వామివారి వద్ద దాసంగలు చేసి, తమ మొక్కులు చెల్లించుకుని, కుటుంబాల సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతరలో రేపు తెల్లవారుజామున జరిగే రథోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రతి ఏడాది వేలాది మంది పాల్గొనే ఈ రథోత్సవం గుట్టపై ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అలరారుస్తుందని నిర్వాహకులు తెలిపారు. దేవాలయ అభివృద్ధి విషయంలో గ్రామ స్తులు, భక్తుల సహకారం అమోఘమని పూజారి నాగార్జున పేర్కొన్నారు. ప్రతి సంవత్సరమూ ఆలయం మూడుపువ్వులు ఆరుకాయలవలె అభివృద్ధి చెందుతోంది. ఈ ఆధ్యాత్మిక కేంద్రం ప్రాంత ప్రజల విశ్వాసానికి నిదర్శనం” అని ఆయన అన్నారు.

# రవాణా శాఖ సేవల్లో నిబంధనల అమలు తప్పనిసరి

- ఆర్టీవో కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామంలో ఉన్న జిల్లా రవాణా అధికారి (ఆర్టీఓ) కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల హాజరు, వారి పనితీరు, కార్యాలయ నిర్వహణ విధానాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ ఆన్‌లైన్‌లో అందిస్తున్న సేవలపై సమగ్రంగా ఆరా తీశారు. ముఖ్యంగా స్లాట్ బుకింగ్ వ్యవస్థ, వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సుల జారీ మరియు పునరుద్ధరణ, వాహనాల ఓనర్‌షిప్ బదిలీ, రోడ్డు టాక్స్ చెల్లింపు, కమర్షియల్ వాహనాల అనుమతుల మంజూరు వంటి అంశాలపై అధికారులు వివరాలను సమర్పించారు. అదేవిధంగా ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపు ప్రక్రియ, ఫిట్నెస్ వాహనాల తనిఖీలు ఎలా నిర్వహిస్తున్నారో కూడా కలెక్టర్



ఆర్టీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

అధికారులు నుండి తెలుసుకున్నారు. జిల్లా రవాణా కార్యాలయ పరిధిలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, పన్నుల చెల్లింపులు, వాహనాల బదిలీలు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ, పునరుద్ధరణ, కమర్షియల్ వాహనాల అనుమతులు వంటి కార్యకలాపాలు నిరంతరంగా కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వాహనాల ఫిట్నెస్ తనిఖీలు, అవసరమైన పత్రాల పరిశీలన, రోజువారీ వాహన అనుమతుల మంజూరు వంటి పనులు కూడా నియమాల ప్రకారం నిర్వహిస్తున్నామని డీటీఓ చిన్న బాలు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సుల జారీ, వాహనాల ఫిట్‌నెస్ మంజూరు, రోడ్డు సురక్షా ప్రమాణాల ప్రకారం వాహనాల తనిఖీలు వంటి రవాణా శాఖకు సంబంధించిన అన్ని సేవలను పూర్తిగా నిబంధనలు, మార్గదర్శకాలు, చట్టపరమైన విధి విధానాలకు కట్టుబడి, పారదర్శకంగా, ఎటువంటి ఆలస్యం లేకుండా ప్రజలకు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సేవలు సమయపాలనతో, బాధ్యతతో, వ్యవస్థబద్ధంగా అమలు కావాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రతి దశలో జాగ్రత్తలు తీసుకోవాలని కూడా డీటీఓకు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ జిల్లా రవాణా అధికారి చిన్న బాలు నాయక్, ఆర్టీఓ ఇన్‌స్పెక్టర్లు మహేష్, అనూప్‌రెడ్డి, రాజశేఖర్, మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# అభ్యర్థులకు ఎన్నికల నిబంధనల ధృవ పత్రాలు అందించాలి

### ఎర్రవల్లి, ఇటిక్యాల, ఉదండాపురం నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు

**ఇటిక్యాల డిసెంబర్ 4, ప్రభాతవార్త:** మూడో విడతలో సర్పంచ్ వార్డ్ మెంబర్ల నామినేషన్లు కొనసాగుతుండగా సర్పంచ్ అభ్యర్థులకు ఎన్నికల నిబంధనల ప్రకారం అనుబంధం 6 నిబంధనల ప్రకారం అనుబంధం 6.7. అలాగే అభ్యర్థి చేసే ఖర్చు వివరాల పత్రాలు కూడా వారికి అందించేలా చూడాలని ట్రైని డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి. రాజ్ కుమార్ లు రిటర్నింగ్ అధికారులకు. గురువారం ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాలలో రెండవ రోజు నామినేషన్ల కార్యక్రమం కొనసాగుతుండగా ఎర్రవల్లి లోని రెండు నామినేషన్ కేంద్రాలు ఇటిక్యాల, ఉదండాపురం తదితర నామినేషన్ కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల వివరాలు అభ్యర్థుల ఎన్నికల వ్యయం వివరాల పత్రాలు. పంచాయతీరాజ్ లోని ఎన్నికల నిబంధనల అనుబంధం 6.7. ఇతర పత్రాలు పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులకు అందేలా చూసుకోవాలని ఎంపీడీవో మహమ్మద్ హజార్ మొహియుద్దిన్. మరియు రిటర్నింగ్ అధికారులకు వివరించారు. అలాగే నామినేషన్ల పూర్తి పరిశీలన అనంతరం అభ్యర్థులకు కేటాయించే సింబల్స్ ని కూడా నామినేషన్ కేంద్రాల వద్ద ఉండేలా చూసుకోవాలన్నారు. అక్కడ ముందుగా ఇబ్బందులు లేకుండా నామినేషన్ లో తప్పులు



నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న ట్రైని డిప్యూటీ కలెక్టర్లు

దొరలకుండా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తీసుకోవాలని వారికి సూచించారు. అంతేకాక మండల ఎన్నికల నోడల్ అధికారి తహసిల్దారు వీరభద్రప్ప ఇటిక్యాల ఉదండాపురం నామినేషన్ కేంద్రాలను పరిశీలించి రెండవ రోజు వచ్చిన నామినేషన్ల వివరాలు సంఖ్య నిబంధనల ప్రకారం మద్దతులను నామినేషన్లు స్వీకరించి వారికి రసీదులను అందజేయాలని నామినేషన్ కేంద్రంలో అభ్యర్థితో పాటు బలపరిచే వ్యక్తి..మరో వ్యక్తి వారిని మాత్రమే లోపలకి అనుమతించాలన్నారు. వీరి వెంట ఆర్ఐ మదన్ మోహన్. నా మేషన్ కేంద్రాల వద్ద రిటర్నింగ్ అధికారులు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు. ఆయా గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు.

# 2వ రోజు నామినేషన్ కేంద్రాల వద్ద సందడి

### మండలంలో 11 సర్పంచ్ నామినేషన్లు..

### 56 వార్డ్ మెంబర్లు నామినేషన్లు దాఖలు...

**ఇటిక్యాల డిసెంబర్ 4, ప్రభాతవార్త:** ఉమ్మడి ఇటిక్యాల ఎర్రవల్లి మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా మూడవ విడుదల సర్పంచ్ వార్డ్ మెంబర్లకు ఎన్నికలు జరుగుతుండగా 7 నామినేషన్ కేంద్రాలలో ఈనెల 3.4.5వ తేదీలలో నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తున్నారు. విన్నపత్రంలో గురువారం రెండవ రోజు నామినేషన్లు వేసేందుకు సర్పంచ్ అభ్యర్థులు వార్డ్ మెంబర్ అభ్యర్థులు కేంద్రాల వద్ద సందడిగా మారింది. ఉదండాపురం నామినేషన్ కేంద్రంలో వావిలాల గ్రామం నుండి చిన్న మోహన్ గౌడ్. చంద్ర గౌడ్ ఇద్దరు నామినేషన్లు వేయగా వారితోపాటు పదిమంది వార్డ్ మెంబర్లు అభ్యర్థులు కూడా రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులకు నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా ఎర్రవల్లి మండలంలో వేముల పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బిజెపి పార్టీ నుండి జగదీష్ రెడ్డి నామినేషన్ వేస్తుండగా వారికి మద్దతుగా జిల్లా పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు గ్రామంలోని చాటు దగ్గర వార్డు నెంబర్లతో కలిసి నామినేషన్ వేసేందుకు తరలి వెళ్లి నామినేషన్ వేశారు. అలాగే నామినేషన్ కేంద్రాల వద్ద రెండవ రోజు కావడంతో



వావిలాల సర్పంచ్ అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న చిన్న మోహన్ గౌడ్

సాయంత్రం 7 గంటల వరకు పోటీ చేశా అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇటిక్యాల మండలంలోని 3 నామినేషన్ కేంద్రాల వద్ద 11 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేయగా 56 మంది వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్ తెలిపారు.. నామినేషన్ కేంద్రాల వద్ద పోటీ చేసే అభ్యర్థులకు ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ఇంటి పన్ను కట్టించుకొని రసీదు తోపాటు నోడ్యూ సర్టిఫికెట్లను అందజేశారు.

# అక్రమ రవాణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### -జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ సూచనలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా భద్రతా చర్యలను బలోపేతం చేసేందుకు నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముఖ్యంగా సరిహద్దుల్లోని అక్రమ రవాణాను అడ్డుకోవడానికి మన్ననూర్ గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో ఎస్పీ చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎన్నికల సమయంలో భద్రతా సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు మరియు వహించాల్సిన బాధ్యతలపై సిబ్బందికి కీలక సూచనలు జారీ



వాహనాలు తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ

చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరిగే అక్రమ డబ్బు, మద్యం, నిషేధిత వస్తువుల రవాణాపై సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి లోపాలకు తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చిన్న అనుమానం వచ్చినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడటానికి, సరిహద్దుల నుండి ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిరంతరం కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఈ సందర్భంగా కోరారు.

# సమాజంలో నశ వ్యసనాల నిర్మూలన అవసరం

**నారాయణ పేట, డిసెంబరు 4 ప్రభాతవార్త :** ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరియ విశ్వవిద్యాలయం మెడికల్ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నశా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి టీచర్లు బీకే మంజుల,బీకే జయ,బీకే అన్నయ్యలు,రిటైర్డ్ రవాణా అధికారి ఎల్.వీరస్వామి పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మాట్లాడిన కలెక్టర్ సమాజంలో నశ వ్యసనాల నిర్మూలనకు ఇలాంటి కార్యక్రమాలు అత్యంత అవసరమన్నారు. 21వ శతాబ్దాన్ని అడిక్షన్ ఫ్రీ ఇండియాగా తీర్చిదిద్దేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమిస్తున్నాయని తెలిపారు. 2023లో భారత ప్రభుత్వ సామాజిక న్యాయశాఖ బ్రహ్మకుమారి సంస్థతో ఎంఓయు కుదుర్చుకున్న విషయాన్ని నిర్వాహకులు




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా పేటలో ర్యాలీ నిర్వహించటం జరిగిందన్నారు. నశ అంటే డ్రగ్స్ మాత్రమే కాకుండా టెక్నాలజీ దుర్వినియోగం కూడా యువతలో పెద్ద సమస్యగా మారిందని వారు పేర్కొన్నారు. 15-25 సంవత్సరాల వయస్సులో 90 శాతం మంది యువత వ్యసనాల బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యల నుంచి బయటపడటానికి రాజయోగ ధ్యానం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఎంతో ముఖ్యం అని చెప్పారు. దేశంలో టొబాకో, ధూమపానం కారణంగా రోజుకు 2,500 నుండి 3,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా పేట జిల్లాలోని పాఠశాలలు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కొత్తమొల్గర సర్పంచి అభ్యర్థి నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి



నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

**భూత్పూర్,డిసెంబర్ 4,ప్రభాతవార్త :** స్థానిక సంస్థల మూడో దశ సర్పంచి ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియలో భాగంగా భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ సర్పంచి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా మలిశెట్టి వెంకటేష్ గురువారం తన నామినేషన్‌ను కొత్తమొల్గరలో దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియలో ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) సతీమణి కవిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు మాసగౌడ్,ప్రతాప్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## కోర్టు భవన నిర్మాణ పనులను పర్యవేక్షించిన జిల్లా జడ్జి

**దేవరకద్ర, డిసెంబరు 4 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో కోర్టు భవన నిర్మాణ పనులను జిల్లా జడ్జి కళ్యాణ్ చక్రవర్తి పర్యవేక్షించారు. గురువారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన కోర్టు భవన నిర్మాణాలను దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి సూచన మేరకు జిల్లాజడ్జి భవన నిర్మాణపనులను కాంగ్రెస్ నాయకులు చూయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే కోర్టు భవన ప్రారంభోత్సవాన్ని చేపట్టి, కోర్టు కార్యకలాపాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఫారుక్‌అలీ, మాజీ జడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, కొండ గోవర్ధన్ రెడ్డి, ఉమ్మిగారి వెంకటేష్, బాల్సపల్లి శంకర్, కమ్మరి బాలస్వామి, బిసు నరసింహారెడ్డి, జవహర్, రాంపండు, మీసేవ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకటోవార్డులో వీధిలైట్లు అమర్చాలని కమిషనర్‌కు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న పట్టణ బీజేపీ నాయకులు

**భూత్పూర్,డిసెంబర్ 4,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటోవార్డు నల్లగుట్టతండా,సిద్దయ్యపల్లి డబులబెడ్ ఇళ్ల రోడ్డులో వీధిలైట్లు లేక పట్టణ,పల్లె,తండావాసులు అంధకారంలో మగ్గుతున్నారని పేర్కొంటూ భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌కు పట్టణ బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. బీజేపీ జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎండి ఫారూక్,పట్టణ అధ్యక్షుడు ముత్యల నర్సింహులు,నాయకులు కెండ్యాల శ్రీనివాసులు,సత్తూర్ సత్తయ్యగౌడ్,రాజశేఖర్,రాజగోపాల్‌రెడ్డి,మ్యాతరి రాము,సీకూరి కృష్ణయ్య, శివన్నగారి వెంకటేష్,ఊరడి వెంకటేష్,మంగళి శివ,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నర్వలో ఘనంగా రథోత్సవం


**నర్వ, డిసెంబరు 4 ప్రభాతవార్త :** నర్వ మండల కేంద్రంలో శ్రీ శ్రీ బయటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక నేపథ్యంలో



నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బంగ్లా తిమ్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణ మధ్య స్వామివారిని రథంపై ఉంచి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి రథాన్ని లాగారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

**భూత్పూర్,డిసెంబర్4,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఆల వీరికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిం చారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో నత్తి సురేష్,నత్తి వెంకటేష్,నరేష్,నాగయ్య, శ్రీకాంత్, అంజనేయులు,బాలకిష్టయ్య,సుంకరి వెంకటేష్,కంబు వెంకటేష్‌తో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,పార్టీ ప్రధాన కార్యదర్శి తూము శ్రీనివాస్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.



# రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయండి

- ఎన్నికలు సజావుగా సాగాలి
- అవసరమైన అన్ని చర్యలు తీసుకోండి
- జోనల్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్4,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీల్లోని ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన రూట్లను పూర్తిగా పరిశీలించి, పోలింగ్ సిబ్బంది మరియు పోలింగ్ సామగ్రిని సులభంగా రవాణా చేయడానికి అనుకూలంగా రూట్ మ్యాప్‌లను తుది రూపం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జోనల్ అధికారులకు ఆదేశించారు. గురువారం నాడు కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో జోనల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె ఈ సూచనలు ఇచ్చారు.పంపిణీ కేంద్రాల నుండి వేగవంతంగా పంపిణీ చేయడానికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి ముందుగానే సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి అన్ని చర్యలు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లుకు ఆదేశించారు. ఒక వేళ బ్యాలెట్ బాక్స్‌లు పనిచేయకపోవడం వంటి సమస్యలు తలెత్తిన పక్షంలో అదనపు బ్యాలెట్ బాక్స్‌లను వెంటనే అందుబాటులో ఉంచాలని జోనల్ అధికారులకు ఆమె స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగేందుకు జోనల్ అధికారులు, రూట్ అధికారులు పోలింగ్ కేంద్రంల వద్ద ఉన్న ఎన్నికల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు విజయవంతంగా జరిగేటట్టు చూడవలసిన బాధ్యత జోనల్ అధికారుల మీద ఉందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శివేంద్ర ప్రతాప్, జోనల్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, నోడల్ అధికారి వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవాల జోరు..

- రాజాపూర్ మండలంలో రెండు పంచాయతీలు ఏకగ్రీవం
- అదే బాటలో మరికొన్ని జీపీలు?
- సత్తా చాటిన బీఆర్ఎస్



**జడ్చర్ల, డిసెంబరు4 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏకగ్రీవాలజోరు కొనసాగుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పలుచోట్ల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఏకగ్రీవం అవుతున్నాయి. జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ బీఆర్ఎస్ తన సత్తా చాటింది. అధికార పార్టీకి షాక్ ఇస్తూ రెండు సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవడంతో మండలంలో జిల్లాలో చర్చనీయాంశంఅయింది. రాజాపూర్ మండలం మోతుకుల కుంట సర్పంచ్‌గా సభావత్ గీత, కల్లేపల్లి గ్రామ సర్పంచ్‌గా చందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజాపూర్‌లో బీఆర్ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం ఉందని మరోసారి రుజువు అయింది. నూతన సర్పంచ్‌లకు అభినందనలు చెబుతున్నారు. వీరి అభ్యర్థిత్వాలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సొంత మండలం కావడం బిఆర్ఎస్ మద్దతు ఉన్న ఇద్దరు సర్పంచులు ఏకగ్రీవం కావడంతో కారు జోరు మీదున్నట్లు తెలుస్తున్నది.

### మంత్రి వాకిటి శ్రీహరి పై అభిమానంతో గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం



గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శివకుమారును అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**అమరచింత డిసెంబర్4, ప్రభాతవార్త:** అమరచింత మండలంలోని రెండో విడతలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల లో అమరచింత మండలంలోని నాగల కడుమూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా శివకుమార్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే టిఆర్ఎస్ పార్టీ నుండి అడవి రామప్ప నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖమంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి గ్రామ అభివృద్ధి చేపడుతున్నారని రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పై అభిమానంతో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా పోటీ నుండి తప్పుకుంటున్నానని ఆయన అన్నారు. గ్రామ సర్పంచ్ ఏకగ్రీవం సహకరించిన అమ్మపురం సంస్థాన వంశీయులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు శ్రీరామ్ భూపాల్ దొర, రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆయుబ్ ఖాన్ సహకారంతో గ్రామ సర్పంచ్ ఏకగ్రీవంగా చేసినందుకు వారికి శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, జగన్‌రెడ్డి, రాజారెడ్డి, మొహమ్మద్, నాయకులు పాల్గొన్నారు.

### రెండు పంచాయతీలో వార్డుల ఏకగ్రీవ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డ్ మెంబర్‌లు

**దేవరకద్ర,డిసెంబరు 4 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని నార్లోన్ కుంట, బస్వాపూర్ రెండు గ్రామ పంచాయతీలవార్డ్ నెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాచారం ప్రకారం నార్లోన్ కుంట గ్రామ పంచాయతీలోని 3వ వార్డ్ మెంబర్‌గా పశువుల భాగ్యమ్మ, 6వ వార్డ్ మెంబర్‌గా నారాయణమ్మ, 7వ వార్డు మెంబర్‌గా రాజమణి. అదేవిధంగా బస్వాపూర్ గ్రామ పంచాయతీలోని 1వవార్డ్ మెంబర్‌గా మహేశ్వరి, 8వ వార్డ్ మెంబర్‌గా బుడగ జంగం లావణ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### ఉమ్మడి మండలంలో 10 గ్రామాలు ఏకగ్రీవం

**మద్దూరు, డిసెంబరు 4 ప్రభాతవార్త :** ఉమ్మడి మద్దూరు కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యింది. మొత్తం 40 గ్రామాలల్లో, 10 గ్రామాలు ఏకగ్రీవానికి చేరుకున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ అభ్యర్థులు అప్పి రెడ్డిపల్లి గ్రామం బుడోల్ల మల్లేశ్వరి, చంద్ర నాయక్ తండా సోమ్లా నాయక్, దమ్లా తండా అనిత రత్లావత్, మోమినాపూర్ గూళ్ళ శ్రీదేవి, నర్సాపూర్ అంజిలమ్మ, పెదిరిపాడు అనుసూజ, లింగాల్ చెడు గ్రామం - పటేల్ విజయలక్ష్మి, నందిగామ - శారద, వాల్యనాయక్ తాండ -కాడావత్ రమేష్ నాయక్, నిర్జింత - సి.రజిత ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు సమన్వయంతో ముందుకు రావడంతో పోటీ లేకుండానే ఈ పదిమంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నుకోబడ్డ సర్పంచులకు ప్రోసిడింగ్ ఇవ్వడం జరిగింది. ఉమ్మడి మండలంలో మిగతా గ్రామాల్లో పోటీ జోరు కొనసాగుతుండగా, ఏకగ్రీవం సాధించిన 10 గ్రామాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి.

### బీఆర్ఎస్‌లో చేరికలు



**భూత్పూర్,డిసెంబర్4,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు,కార్యకర్తలు గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.వీరికి గులాబీ కండువాలు కప్పి మాజీ ఎమ్మెల్యే ఆల బీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు.బీఆర్ఎస్‌లో చేరినవారిలో బీజేపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి,మాజీ ఎంపీటీసీ,మాజీ సర్పంచిగొడుగు అంజ నేయులుతో పాటు ఇతర కార్యకర్తలు నాగరాజుగౌడ్, అంజనేయులుగౌడ్,బొంబాయి బుచ్చయ్య,రవికుమార్,చాకలి రాకేష్,వల్లూర్ ఆషన్న యాదవ్, ఈరమల్ల కొండన్న యాదవ్,డాకారయ్య యాదవ్,మాజారు మహేష్,దోమ రామస్వామి,కనిమెట్ట రవి,తోకల సతీష్ తదితరులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించి తాము బీఆర్ఎస్‌లో చేరుతున్నామని బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి గొడుగు అంజనేయులు స్పష్టం చేశారు.

### డీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారంలో పార్టీ అనుబంధ విభాగాల కార్యకర్తలు పాల్గొనాలి

**మహబూబ్‌నగర్ డిసెంబరు 4 ప్రభాతవార్త :** నూతన డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ చైర్మన్ సాయిబాబా, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, జిల్లా యువజన అధ్యక్షులు అవేజ్ అహ్మద్. మైనార్టీసెల్ అధ్యక్షులు ఎండి. ఫయాజ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్ కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంజీవ్ ముదిరాజ్ ఇంటి నుంచి భారీస్థాయిలో ర్యాలీ పార్టీ కార్యాలయం వరకు ఉంటుందని, అనంతరం కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుబంధ విభాగాల శ్రేణులు పాల్గొనాలని వారు కోరారు. సమావేశంలో పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు కిషన్ నాయక్, నాయకులు ఆక్బర్ వెంకటేశ్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

**- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్4,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. గురు వారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పిలు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఉపసర్పంచ్ ఎన్నిక పారదర్శంగా జరపాలన్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన నామినేషన్ల ప్రక్రియ, ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల వివరాలపై నివేదిక అందచేయాలని ఎన్నికల అధికారులకు సూచించారు. ఎన్నికలకు పట్టిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కులో జిల్లా కలెక్టర్ కార్యాలయం వి.సి.కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి, సాధారణ ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి, ఐ. ఏ.ఎస్,ఎస్.పి.డి జానకి,జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, అన్ని విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు

**- ఎన్నికల సాధారణ పరిశీలకులు కాత్యాయని దేవి - జడ్చర్లలో నామినేషన్ స్వీకరణ కేంద్రాల తనిఖీ**



నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎన్నికల పరిశీలకురాలు

**జడ్చర్ల, డిసెంబర్4, ప్రభాతవార్త:** జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియను గురువారం గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి పరిశీలించారు. ఎన్నికలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వికరణ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు.. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, నిర్ణీత గడువు లోపల నామినేషన్ లు స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు.

## టీబీజీని సందర్శించిన బోయపల్లి విద్యార్థులు



విద్యార్థులకు టీబీజీ ప్రాముఖ్యతను వివరిస్తున్న సదాశివయ్య

**జడ్చర్ల, డిసెంబరు4 ప్రభాతవార్త:** డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్ల లో ఉన్న తెలంగాణ బొటానికల్ గార్డెన్ ను మహబూబ్నగర్ మండలం బోయపలి సిఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఎకో క్లబ్ కార్యక్రమంలో భాగంగా 40 మంది విద్యార్థులు 5 మంది ఉపాధ్యాయులు గార్డెన్‌ను సందర్శించారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య సాదర స్వాగతం పలికారు. అనంతరం గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య గార్డెన్‌లోని వివిధ విభాగాల్లోని వివిధ మొక్కలను వాటి ఉపయోగాలను, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఔషధ మొక్కలు చూపించి వాటిని పెంచవలసిన విధానం, వాటి ఉపయోగాలు, వాడుకునే పద్ధతుల గురించి సవివరంగా వివరించారు. మొక్కల పెంపకానికి అవసరమయ్యే మట్టిని ఎలా సిద్ధం చేయాలో చెప్పారు. విద్యార్థులు ఎంతో ఆశక్తితో మొక్కలు నాటడానికి కవర్ లలో మట్టిని నింపారు. అనంతరం జీవవైవిద్య పరిశోధన,విద్యా కేంద్రంలోని పాములను చూశారు. సదాశివయ్య వారికి వివిధ రకాల పాములను చూపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.పురుషోత్తం, జి. రమాదేవి, ఎం. లక్ష్మీ, శిక్షణార్థి ఉపాధ్యాయులు భీమమ్మ, మధుకిరణ్ వాలంటీర్‌లు రవీందర్, భరత్‌లు పాల్గొన్నారు.

## ఫోన్ పే కొట్టు..గంజాయి పట్టు..

- బీహార్ టు పాలమూరు
- యథేచ్ఛగా గంజాయి విక్రయాలు
- గుట్టు రట్టు చేసిన జడ్చర్ల సీఐ విప్లవరెడ్డి బృందం
- వివరాలు వెల్లడించిన డీపీవో సుధాకర్‌గౌడ్



వివరాలు వెల్లడిస్తున్న డీపీఈవో సుధాకర్‌గౌడ్, చిత్రంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నర్సింహ్మారెడ్డి, సీఐ విప్లవరెడ్డి



**మహబూబ్‌నగర్, డిసెంబర్4,ప్రభాతవార్త:** బీహార్ రాష్ట్రం నుంచి పాలమూరు ప్రాంతంలో గంజాయి విక్రయాలు చేస్తూ ఫోన్ పే ద్వారా లావాదేవీలు నడిపిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ రెడ్డి బృందం. ఈమేరకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి సుధాకర్ గౌడ్ జడ్చర్ల స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి (డీపీఈవో) ఆదేశాల మేరకు జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రాజాపూర్ మండలం, ముదిరెడ్డిపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న బిజేష్ కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుండి 1. 1కేజీల గంజాయిని, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన బిజేష్ కుమార్ పోలేపల్లిలో గల సుప్రీం ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో సూపర్వైజర్ గా పనిచేస్తున్నాడు. బీహార్ రాష్ట్రం నుంచి గంజాయినీ తీసుకొని వచ్చి 5 గ్రాములకు 400 చొప్పున, ఫోన్ పే చెల్లింపుల ద్వారా వారికి గంజాయిని అందజేస్తేసున్నట్లు విచారణలో తెలిసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా గంజాయి క్రయ, విక్రయాలు జరిపినట్లయితే 9030019943 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, లేదా కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న సబ్ఇన్స్పెక్టర్స్ జె. నాగరాజు, టి. కార్తీక్ రెడ్డి, హెడాకానిస్టేబుల్స్ మురళీమోహన్, రమేష్, కానిస్టేబుల్స్ సిద్ధార్థ, సునీతను అభినందించారు. జిల్లాలో గంజాయి క్రయ విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని, జడ్చర్ల పరిధిలో ఇప్పటి వరకు 12 కేసులను నమోదు చేసి 6.4 కేజీల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను దగా చేస్తున్న కాంగ్రెస్

**బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్**



మాట్లాడుతున్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్

**మహబూబ్‌నగర్ డిసెంబరు 4 ప్రభాతవార్త :** 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని విస్మరించి స్థానిక సంస్థల ఎన్నికలలో 17శాతం రిజర్వేషన్‌లు కేటాయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను దగా చేశారని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బికె రెడ్డి కాలనీలో బీసీ జాగృతి సేన నాయకుల సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికలలో అధికార పార్టీ సానుభూతి పరులను ఓడించాలని బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇండియా కూటమి లోక్ సభ సభ్యులతో కలిసి ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రైవేట్ బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి రిజర్వేషన్ల అమలుకై కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం తప్ప అధికారంలోకి వచ్చాక ఏ రాజకీయ పార్టీ కూడా చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలన్న డిమాండ్‌ను పట్టించుకోవడంలేదని ఓటు వేసే యంత్రాలుగా, సంపద సృష్టించే మనమనసులుగా చూస్తున్నారు తప్ప పాలనలో భాగస్వామ్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన లోకసభ, రాజ్యసభ సభ్యులందరూ ప్రస్తుత శీతాకాల పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లుకై పోరాడాలని కోరారు. నరేందర్, హరి, సంతోష్, గణేష్, మోహన్, శివ, ఉపేందర్, బాలు, శ్రీకాంత్, వేణు, రవి, రామ్ చరణ్, సాయి దీపక్ పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీదత్తాత్రేయ స్వామి జయంతి



దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న డా.సి.లక్ష్మారెడ్డి

**జడ్చర్ల,డిసెంబరు4 ప్రభాతవార్త:** జడ్చర్లలో దత్తాత్రేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా దత్తమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు డా.సి.లక్ష్మారెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించి వడ్డించారు. భక్తులకు దత్తాత్రేయ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

### ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజనపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

నివేధికలను సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ స్పష్టంగా సూచించారు. అంతేకాక, ప్రతీ పథకానికి చెందిన విధి విధానాలు, కార్యాచరణ ప్రణాళికలు మరియు అమలు వ్యవస్థలను శాఖల వారీగా పరిశీలించనున్నట్లు కూడా ఆయన తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పత్తి, అటవీ, నీటిపారుదల, భూసంస్కరణ, మార్కెటింగ్, కోఆపరేటివ్, గ్రామీణ అభివృద్ధి తదితర అనుబంధ శాఖలలో ప్రతి పథకం అమలులో ప్రస్తుత దశలు,ఉపయోగపడుతున్న వనరులు, రైతులకు పొందు పరచబడుతున్న ప్రయోజనాలు, ఇంకా గ్రౌండ్ లెవెల్‌లో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు వంటి అంశాలను స్పష్టమైన మరియు సమగ్రరూపంలో సమర్పించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి పథకం ఒక విశేషమైన అవకాశమని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ పథకం ద్వారా రైతుల ఆదాయం, సాగు వనరులు, నీటిపారుదల సదుపాయాలు, పంటల వైవిధ్యీకరణ, మార్కెట్ లింకేజ్ వంటి అనేక కీలకపారామితులలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని ఆయన భావించారు.ఈ యోజనను వేగవంతంగా, నిర్దిష్ట లక్ష్యాలతో అమలు చేయడానికి అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకం అని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ప్రతి శాఖ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించి, రైతులకు అనుకున్న ప్రయోజనాలు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా కోఆపరేటివ్,ఉద్యాన శాఖ, నీటిపారుదల, జిల్లా పాడి పరిశ్రమ, జిల్లా మత్స్యశాఖ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### విద్యే ప్రధాన శక్తి

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ ఆధారిత విద్యఇప్పుడు తప్పనిసరి అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి కూడా సమాన అవకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్‌అభివృద్ధి చెంది మహబూబ్‌నగర్ ఫస్ట్ స్థానంలో నిలవాలంటే ముందుగా మన పిల్లల భవిష్యత్తు బలపడాలని అన్నారు. ఆ బలం సంపాదించేది ఒక్క విద్య ద్వారానే సాధ్యమని చెప్పారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, టార్గెట్ ఐఐటి లక్ష్యంగా పెట్టుకుని క్రమశిక్షణతో, నిబద్ధతతో ముందుకు సాగాలి” అని అన్నారు. పదవ తరగతి మీ జీవితంలో చిన్న అడుగు కాదని, మీ గమ్యాన్ని నిర్ణయించే కీలక దశఅని గుర్తించుకోవాలని చెప్పారు.డిజిటల్ స్టడీ మెటీరియల్స్‌ను పూర్తిగా వినియోగించుకుని ప్రతిభను నిరూపించాలని, మీరు విజయాన్ని స్పష్టమైన లక్ష్యంతో కోరుకుంటే, దానిని సాధించే మార్గాలు స్వయంగా మీ ముందుకు వస్తాయి”అని ఆయన విద్యార్థులకు తెలిపారు.కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధు సూదన్‌రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగంరాఘవేంధర్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్,మాజీ మున్సిపల్‌కౌన్సిలర్లు మోసిన్, అంజద్,నాయకులు చందుయాదవ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుమరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లపై ఆరాబోసిన వరి ధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇలా రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబోయడం ఎందుకని ప్రశ్నించే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డుపై ఆరబెడుతున్న వరి ధాన్యాన్ని తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

### వైభవంగా పడమటి ఆంజనేయ స్వామి రథోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి తన స్వగృహం నుండి నడుచుకుంటూ వచ్చి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పి. ప్రాణేశాచార్య, ఈవో కవిత, మాజీ ఎంపీపీ బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, దేవరింటి నర్సింహారెడ్డి, బి. రాజశేఖర్‌రెడ్డి, బ్యాటరీరాజు, కురువలింగం, కాంగ్రెస్ నాయకులు జి.లక్ష్మారెడ్డి, బోయ రవికుమార్, కావలి తాయప్ప, వల్లంపల్లి లక్ష్మణ్, బిఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి పాల్గొన్నారు.

### 10న పీయూలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌కు ఒరియంటేషన్ కార్యక్రమం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు4 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సెల్, బియాండ్ యువర్ మైండ్ ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో ఈ నెల 10న ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌కు ఛాలెంజ్స్ ఫేసింగ్ బై ఉమెన్ అండ్ యూత్ అనే అంశంపై ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఉంటుందని ఆచార్య జిఎన్ శ్రీనివాస్ తెలియజేశారు. ఇందుకు సంబంధించి వీసీ ఛాంబర్‌లో రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు, ఇతర అధికారులతో కలిసి బ్రోచర్‌ను ఉపకులపతి ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యువత ఎదుర్కొనే సమస్యలపై ప్రసంగించడానికి ముఖ్య వక్త గా ప్రొ॥ సరోజ గుళ్ళపల్లి, ఫౌండర్ బివైఎం, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియావస్తున్నారని, ఈఅవకాశాన్ని వాలంటీర్స్ ఉపయోగించు కోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కన్వీనర్ డా ప్రవీణ, చైర్మన్‌లు డా.మధుసూదన్ రెడ్డి, డా. రవికాంత్, ప్రోగ్రాం అధికారులు డా.ఎస్ రవికుమార్, డా.వెంకట రాఘవేంద్ర పాల్గొన్నారు.

### ఎర్రవల్లి మండలంలో సర్పంచ్ నామినేషన్లు 16.. వార్డు మెంబర్లకు 53 నామినేషన్లు

**ఇటిక్యాల డిసెంబర్4, ప్రభాతవార్త:** ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని కొత్త ఎర్రవల్లి మండలంలో సర్పంచ్ వార్డ్ మెంబర్లకు నామినేషన్లు స్వీకరిస్తుండగా గురువారం రెండవ రోజు 15 పంచాయతీలు ఉండగా 16 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా. అలాగే 53 మంది వార్డ్ మెంబర్లకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్ తెలిపారు.3వ తేదీబుధవారం మొదటి రోజు 14 మంది సర్పంచ్ అభ్యర్థులుగా.20మంది వార్డ్ మెంబర్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. 2 రోజుల నుండి సర్పంచ్ అభ్యర్థులుగా 30మంది.వార్డ్ మెంబర్లుగా 73 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్ తెలిపారు...